నాపరాయి.. కార్మికులకు జీవనోపాధి

- రాతిగనులు, అనుబంధంగా పాలీష్ బండల ఫ్యాక్టరీలు
- కంకర, చిప్స్ మిషన్ యూనిట్లు
- వందలాది కార్మికులకు ఉపాధి


బండలకు పాలీష్ పెడుతున్న కార్మికులు

మిడుతూరు: ఒకప్పుడు ఎందుకూ పనికిరాని నాపరాతి గనులు ప్రస్తుతం నాపరాతి బండలకు డిమాండ్ పెరుగుతుండటంతో గనుల యజమానులకు మంచి ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. వందలాది కార్మికులకు జీవనోపాధి నిస్తున్నాయి. అలాగే వీటి అనుబంధనంగా వెలసిన పాలీష్ బండల పరిశ్రమల ద్వారా ఒక్కో యూనిట్‌లో 10 నుంచి 15 మంది ఉపాధి పొందుతున్నారు.

నాగలూటి రాయికి మంచి డిమాండ్

నందికొట్కూరు నియోజకవర్గంలోని మిడుతూరు, నందికొట్కూరు, పగిద్యాల మండలాల్లో కొణిదేల, నాగలూటి, పీరుసాహెబ్ పేట, నెహ్రూనగర్, సంకిరేణిపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 1,000 నుంచి 1,200 ఎకరాలల్లో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. ప్రతి రోజు వేలాది మంది కార్మికులు నాపరాతి గనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మిడుతూరు మండల పరిధిలోని నాగలూటి గ్రామంలోని నాపరాయికి పలు రాష్ట్రాలల్లో ప్రత్యేక గుర్తింపుతో పాటు డిమాండ్ ఉండటంతో ప్రతి నిత్యం గని కార్మికులు డిమాండ్‌ను బట్టి రాయిని తీసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఒక్కో పాలిషింగ్ యూనిట్‌లో 10 నుంచి 15 మందికి పని

నాపరాతి గనులకు అనుబంధంగా మిడుతూరు, నాగలూటి,పీరుసాహెబ్ పేట, నందికొట్కూరు, బ్రహ్మణకొట్కూరు, కొణిదేల తదితర గ్రామాల్లో నాపరాయి పాలిషింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్క యూనిట్లలో దాదాపు 10 నుంచి 15 మంది వర్కర్లు పనిచేస్తున్నారు. వీటితో పాటు పలుచోట్ల నాపరాయి కంకర (చిప్స్, డస్ట్ యంత్రాలు) ఏర్పాటుచేసుకొని యజమానులు లబ్ధిపొందడంతోపాటు కార్మికులు ఉపాధిని పొందుతున్నారు.

గనుల్లోని నీరు వ్యవసాయానికి ఉపయుక్తం

నాపరాయిని, కంకరను నిర్మాణ రంగాలల్లో వినియోగిస్తున్నారు. దీంతో ఆయా నాపరాతి గనుల నుంచి ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లు, లారీల ద్వారా సరఫరా చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టీ ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. నాపరాతి గనులు కార్మికులకు ఉపాధి కల్పించడంతోపాటు సమీప పొలాల రైతులకు పంటసాగులో వర్షాకాలంలో నిల్వ ఉన్న నీటిని మోటార్ల ద్వారా ఆరుతడి పంటల సాగుకు వినియోగిస్తున్నారు. అలాగే సమీప గ్రామాల్లోని బోరుబావుల్లో భూగర్భజలాలలు పెరిగేందుకు దోహదపడుతున్నాయి.


కంకర తయారు చేస్తున్న దృశ్యం


నాగలూటి గ్రామంలో నాపరాతి గని

రోజు కూలి రూ. 700 వస్తుంది


ప్రస్తుతం నాపరాతి గనులలో వర్షపు నీరు లేకపోవడంతో ప్రతి రోజు పనికానసాగుతోంది. రోజు పనికి వెళ్తే రూ. 600 నుంచి రూ. 800 కూలి వస్తుంది. వర్షాకాలంలో నాపరాతిగనులు నీటితో నిండటంతో పనులు లేక ఉపాధిని కోల్పోతాం. – శ్రీనివాసులు, మిడుతూరు

వందలాది మంది పని చేస్తున్నాం


పీరుసాహెబ్ పేట, నాగలూటి గ్రామాల్లో ఉన్న పాలీష్ బండల ఫ్యాక్టరీలు, నాపరాతి గనులలో వందలాది మంది కార్మికులు పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఏదైన ప్రమాదం జరిగితే.. ప్రభుత్వం కార్మికులకు ఇన్స్‌రెన్స్ కల్పిస్తే బాగుంగుంది. – వెంకటరమణ, నాగలూటి

డిమాండ్‌ను బట్టి రాయిని తరలిస్తుంటాం...

బహిరంగ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి నాపరాయిని ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటాం. పట్టణ ప్రాంతాలల్లో మార్బుల్స్, టైల్ ఆదరణ ఉండటంతో నాపరాయికి గిరాకీ తగ్గింది. గనుల్లో నాపరాయిని వెలికి తీయాలంటే యంత్రాల సహాయం తప్పనిసరి కావడంతోపాటు కూలీల, ట్రాక్టర్ బాడుగలు, విద్యుత్ చార్జీలు పెరగడంతో ఆదాయం అంతంతమాత్రంగానే ఉంది. వర్షాకాలంలో నీరు చేరితే పనులు జరగవు. కార్మికులకు వర్షాకాలంలో ఉపాధి ఉండదు.

–నబిరసూల్ , పాలీష్ బండల ఫ్యాక్టరీ యజమాని , నాగలూటి

క్లుప్తంగా

సులభరీతిలో బోధించండి


ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్స్ అందజేస్తున్న ఎంఈఓ మౌలాలి

మిడుతూరు: విద్యార్థుల స్థాయిని బట్టీ సులభరీతిలో బోధన చేయాలని ఎంఈఓ మౌలాలి సూచించారు. ఆదివారం స్థానిక మండల రిసోర్స్ భవనంలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు రిలీవింగ్ ఆర్డర్లు అందజేశారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల నుంచి జాయినింగ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ నూతన ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు.

విద్యార్థి జగదీష్ మృతి బాధాకరం

మహానంది: ఆరో తరగతి చదువుతున్న బుక్కాపురం గ్రామానికి చెందిన కుంచపు జగదీష్(13) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన బుక్కాపురం గ్రామానికి చేరుకుని జగదీష్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా నిచ్చారు.

మహానందిలో నేడు 'వలంటీర్లకు వందనం'

మహానంది: మహానందిలో సోమవారం సాయంత్రం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మహానందిలోని శాలివాహన అన్నదాన సత్రం భవనంలో జరిగే కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఉత్తమసేవలు అందించిన వలంటీర్లకు సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర అవార్డులు అందిస్తారన్నారు.

గుండెపోటుతో లష్కర్ మృతి


శ్రీరాములు(ఫైల్)

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా గ్రామంలో లష్కర్ శ్రీరాములు(43) గుండెనొప్పితో ఈ నెల 10వ తేదీ రాత్రి మృతి చెందాడు. ఇతని ఆదోని డివిజన్‌లో పని చేస్తున్నాడు. మృతుడి భార్య హైమావతి అనారోగ్యంతో దాదాపు 10 సంవత్సరాల క్రితం మృతి చెందింది. దీంతో వారికున్న ఇద్దరు పిల్లలు సాయి, నందినిలు పిల్లలు అనాథలయ్యారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, జెడ్పీటీసీ భర్త రామలింగేశ్వరరెడ్డి, మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్, తండ్రి ఉద్యోగం కుమారుడికి ఇప్పించేందుకు కృషి చేస్తానని, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

తూడిచెర్ల-పారుమంచాల రోడ్డు నిర్మించాలి

జూపాడుబంగ్లా: తూడిచెర్ల-పారుమంచాల రోడ్డును నిర్మించాలని సీపీఐ, బీఎస్పీ పార్టీల నాయకులు రమేష్‌బాబు, స్వాములు డిమాండ్ చేశారు. ఆదివారం తూడిచెర్ల గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ పారుమంచాల-తూడిచెర్ల రోడ్డు గుంతలమయమైందన్నారు. ఈ దారిన తూడిచెర్ల, వాడాల, మిట్టకందాల, రేగడగూడూరు గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.6లక్షల నిధులు మంజూరైనా నేటికీ మరమ్మతు పనులు చేపట్టకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని రోడ్డును నిర్మించాలని కోరారు.

కర్షకులకు కల్వర్టు కష్టాలు


దెబ్బతిన్న కల్వర్టు

వెలుగోడు: రైతులకు కల్వర్టు కష్టాలు తప్పడం లేదు. మోతుకూరు మజరా గ్రామమైన తిమ్మనపల్లిలో పంట పొలాలకు వెళ్లే కల్వర్టు ఏడాదిన్నర క్రితం కుంగి పోయింది. దీంతో రైతుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ కల్వర్టు మీదుగా పొలాలకు వెళ్తే 2 కిలోమీటర్లు దూరం ఉంటుంది. కల్వర్టు దెబ్బతినడంతో ఆరు కిలోమీటర్లు చుట్టూ తిరిగి పొలాలకు వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రస్తాలో దాదాపు 200 ఎకరాలు ఉంటుందని, కల్వర్టును బాగు చేయాలని రైతులు శివశంకర్, మధు, వెంకటరమణ, సుంకిరెడ్డి తదితరులు కోరుతున్నారు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆదివారం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ మౌలాలి తెలిపారు. ఆదివారం పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రవేశపరీక్షకు 170 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని, 150 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

పరీక్షకు 110 మంది హాజరు

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో 6వ తరగతిలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 110 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ నాగరవీంద్ర తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్షకు 122 మంది దరఖాస్తు చేసుకోగా 12 మంది గైర్హాజరయ్యారు. ప్రశాంతంగా పరీక్షజరిగిందని వివరించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ


విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ సుభాన్

పగిద్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని మండల విద్యాధికారి సుభాన్ తనిఖీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు 6వ తరగతిలో చేరడానికి 86 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. పరీక్షకు మాత్రం 75 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ వెల్లడించారు. ఆయన వెంట సీఆర్‌పీ మధునాయుడు ఉన్నారు.

పాఠశాలకు స్థలం విరాళం


విరాళంగా ఇచ్చిన స్థలాన్ని హెచ్‌ఎంకు అప్పగిస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు ప్రాథమిక పాఠశాల సౌకర్యార్థం గ్రామ సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి సెంటు స్థలాన్ని కొనుగోలుచేసి ఇచ్చారని పాఠశాల హెచ్‌ఎం జాకీర్‌హుసేన్ తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు టాయ్‌లెట్లు మంజూరు అయ్యాయన్నారు. వాటి నిర్మాణం నిమిత్తం అవసరమైన స్థలం లేకపోవటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన సర్పంచ్ పీఎం నాగిరెడ్డి పాఠశాల వెనకాల ఉన్న స్థలంలో రూ.60వేలు సొంతడబ్బును వెచ్చించి సెంటు భూమి కొనుగోలు చేసి పాఠశాలకు ఇచ్చారని చెప్పారు. ఆ స్థలంలో టాయ్‌లెట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి దోహదపడిన సర్పంచ్‌ను హెచ్‌ఎం జాకీర్‌హుసేన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

33 మంది ఉపాధ్యాయుల బదిలీ


ఎంఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేస్తున్న ఉపాధ్యాయులు

పగిద్యాల: సాధారణ బదిలీలో భాగంగా మండలంలో 33 మంది ఉపాధ్యాయులు పదోన్నతి, బదిలీలపై ఇతర మండలాలకు వెళ్లారని మండల విద్యాధికారి సుభాన్ ఆదివారం తెలిపారు. ఈ క్రమంలో ఇతర మండలాల నుంచి మండలానికి 15 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చి ఆదివారం రిపోర్ట్ చేసుకున్నారని చెప్పారు. కాగా వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, మొదటి రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. మండల వ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 3,505 మంది విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

కొత్తపల్లి: సోమవారం నుంచి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నట్లు ఎంఈఓ శ్రీరాములు ఆదివారం తెలిపారు. ఎండల తీవ్రత, వడగాల్పుల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు ఒంటిపూట తరగతులను నిర్వహించాలని ఆదేశాలు జారి చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు ఉదయం 7.30 నుంచి 11.30 గంటలవరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం కూడా ఉంటుందని చెప్పారు.

ఉద్యోగులకు నేరుగా జీతాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా జీతాలు ఇవ్వాలని సంఘం జి.3045 కర్నూలు జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ కోరారు. స్థానిక క్రాంతినగర్ కార్యాలయంలో ఆదివారం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెగ్యులరైజేషన్‌కు సంబంధించి విద్యుత్ యాజమాన్యం తరపున కేబినేట్ సబ్ కమిటీకి ప్రపోజల్ పంపాలని కోరారు. సంఘం రాష్ట్ర నాయకుడు మధు మాట్లాడుతూ 2022 పీఆర్సీతో కలిపి డీఏ, ఇంక్రిమెంట్లతో కూడిన వేతనాలు చెల్లించాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, రూ.20లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు గోపాల్, మద్దయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


పగిద్యాలలో బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

కొత్తపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని సర్పంచు బి.లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కౌసల్య ఆధ్వర్యంలో సమ్మర్‌క్యాంపు ముగింపు వేడుకలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో గత నెల 8 నుండి జూన్‌నెల 11వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించామన్నారు. అందులో భాగంగానే విద్యార్థులతో కథలు చెప్పడం, డ్రాయింగ్, చేస్ పోటీ, క్యారమ్ బోర్డ్ పోటీ, సంగీత కుర్చీల ఆటతో పాటు మరెన్నో కార్యక్రమాలు చేశామన్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్పంచ్ బి.లక్ష్మీదేవమ్మ చేతులమీద బహుమతులు అందజేశామన్నారు. ఉపాధ్యాయులు వాసుదేవరెడ్డి, సుబ్బారెడ్డి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. అనంతరం లైబ్రేరియన్ కౌసల్యలను సర్పంచు లక్ష్మీదేవమ్మ దుశ్శాలువలు, పూలమాలతో సన్మానించారు.

విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఉపయోగకరం

నందికొట్కూరు: వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురళీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

పగిద్యాల: వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న బహుమతులు అందజేశారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హజరైన జెడ్పీటీసీ, సర్పంచ్‌లు విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలు చదవడం అలవర్చుకోవాలన్నారు. ఎక్కువ పుస్తకాలను చదవడం వలన జ్ఞానం వృద్ధి చెందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మద్దమ్మ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

మహానందీశ్వరుడి సన్నిధిలో ...


న్యాయమూర్తికి మహానందీశ్వర మెమొంటో అందిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి ప్రభాకరశర్మ, ఉష దంపతులు ఆదివారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, వేద పండితులు రవిశంకర అవధాని స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి,అమ్మవారి ప్రసాదాలు, మెమొంటో అందించి సన్మానించారు. వారి వెంట డీటీ కామేశ్వరరెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఎన్నికల అధికారి


వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న ఎన్నికల అధికారి

కొత్తపల్లి: సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారి (అడిషనల్ సీఈఓ) వెంకటేశ్వరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయ సంప్రదాయానుసారంగా వారికి స్వాగతం పలికారు. ఆలయ చరిత్రను ఆయనకు వివరించారు. అనంతరం సంగమేశ్వరాలయంలోని వేపదారు శివలింగానికి నదీజలాలతో అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, రుద్రాభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను, కృష్ణానదితీర ప్రాంతాన్ని సందర్శించారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


అమ్మవారి విగ్రహం

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ మారెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహాస్నపనం, విగ్రహ హోమం, దాన్యాధివాసం, పుష్పాభివాసం కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం దాన్యాధివాసం, కుక్షజ్వాలహోమం, శయనాధివాసం కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం ఉదయం మారెమ్మతల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు, గ్రామస్తులు తెలిపారు.

మహానందిలో సండే సందడి


కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా రుద్ర, బ్రహ్మ, విష్ణు గుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. మహానందీశ్వరుడి దంపతులకు రాత్రి ఏకాంతసేవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నంద్యాల(వ్యవసాయం): కర్నూలు ఉమ్మడి జిల్లాలోని పది, ఇంటర్మీడియెట్‌లో అత్యంత ప్రతిభ చూపిన పద్మశాలీయ విద్యార్థులకు పద్మశాలీయ జిల్లా అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, నగదు, మెమొంటోలు అందజేశారు. స్థానిక భద్రావతి భవనారాయణస్వామి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆరుగురు విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతి రూ.5వేల నగదుతో పాటు మెమొంటో అందజేశారు. అలాగే 61మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతిగా ఒక్కొక్కరికి రూ.2వేలు నగదు, మెమొంటో అందజేశారు. ప్రధాన కార్యదర్శి గాజుల శంకర్, అఖిల భారత పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, పబ్బుతులసీ కృష్ణ, కౌన్సిలర్లు పున్నారాజేశ్వరి, పురంధర్ పాల్గొన్నారు.

కేసీ గట్టుకు అక్రమార్కుల పోటు

- కేసీ సైడ్‌బండ్ మట్టిని తవ్వి పొలాలకు తరలిస్తున్న వైనం
- సమాచారమిచ్చినా పట్టించుకోని అధికారులు


అక్రమంగా మట్టిన తవ్విన ప్రదేశాన్ని చూతుతున్న గ్రామస్తులు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ పొలిమేరలో కేసీ కెనాల్11వ కిలో మీటరు వద్ద కేసీ కెనాల్ సైడ్ బండ్‌కు గుణపం పోటు వేశారు. కెనాల్ గట్టును గ్రామానికి చెందిన ఓ రైతు యథేచ్ఛగా మట్టిని ఎర్త్ మూవర్ (ప్రొక్లెయిన్)తో తవ్వి మట్టిని పొలాలకు తరలించారు. ఈ తతంగాం పై ఏ అధికారికి చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తిరుపతయ్య, జనార్దన్, ఉపేంద్రలు ఆరోపిస్తున్నారు. దాదాపు 10 అడుగుల లోతులో మట్టిని తవ్వినట్లు తెలిపారు. గతప్రభుత్వ హయాంలో కేసీ పక్కనే ఉన్న వాగులో నీరు- చెట్టు కింద పనులు చేశారు. ఇప్పుడు అదే ప్రదేశంలో కేసీ బండ్ వెంట దాదాపు 2 మీటర్ల మేర కేసీ గట్టును తవ్వి మట్టిని తరలించారు. ఇలా తవ్వకాలు జరపడం వల్ల భారీ వర్షాలు కురిస్తే కేసీ కాలువ గట్టు కోతకు గురయ్యే ప్రమాదం లేకపోలేదని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ప్రాంతం మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉంది

తవ్వకం జరిపిన ప్రాంతం వాగుకు చెందినది. అందుచే మాకు సంబంధించినదికాదు. మైనర్ ఇరిగేషన్ శాఖకు సంబంధించినది. నీరు చెట్టు కింద గతంలో పనులు చేపట్టారు. వాగును 2 మీటర్ల మేర విస్తరణలో తవ్వకాలు జరిపారు. ఆ మట్టిని పొలంలో వేసుకోవడం తప్పు. కేసీ కెనాల్‌కు సంబంధించినదైతే మేము నోటీసులు ఇచ్చేవాళ్లం. అయినప్పటికీ ఉన్నతాధికారులకు విషయం తెలియజేశాము. వారు వచ్చి పరిశీలిస్తారు.

– శ్రీనివాసనాయక్, ఏఈ, కేసీ కెనాల్

నేటి నుంచి మోగనున్న బడి గంట

- 42 రోజుల తర్వాత పునఃప్రారంభం కానున్న పాఠశాలలు
- జగనన్న విద్యాకానుకలు పంపిణీకి సిద్ధం
- 17వ తేదీ వరకు ఒంటిపూట బడులు


ట్రైల్‌గా బడిగంటను మోగిస్తున్న జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాల వాచ్‌ఉమెన్


విద్యార్థులకు మంజూరైన బూట్లను సిద్ధం చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు/ జూపాడుబంగ్లా: ఆట పాటలకు ఇక సెలవు. వేసవి సెలవులను ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపిన పిల్లల వీపుపై సోమవారం నుంచి మళ్లీ పుస్తకాల మోత పడనుంది. ఇన్నాళులకు 6 గంటల తరువాత నిద్ర లేచి అమ్మ ఇప్పుడు వేకుజామునే మేల్కొవాలి. పిల్లలకు స్నానం చేయించి, ముస్తాబు చేసి బడికి పంపాలి. నాన్న వారిని వాహనంపై ఎక్కించుకుని హడవిడిగా బడి వద్ద దింపి రావాలి. దాదాపు 42రోజుల అనంతరం నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నాయి.

నియోజకవర్గంలో 257 ప్రభుత్వ పాఠశాలలు

2022-23 ఏడాది విద్యాసంవత్సరానికి గాను ఏప్రిల్ నెలాఖరునుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. 2023-24 ఏడాది విద్యాసంవత్సరానికిగాను పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో అప్‌గ్రేడ్ అయిన విద్యార్థులు నూతన పాఠ్యపుస్తకాలతో కుస్తీపట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 257 పాఠశాలలుండగా 32,785 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారందరికీ ఇప్పటికే జగనన్న విద్యాకానుక లో భాగంగా నియోజకవర్గంలోని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, బ్యాగులు, డిక్షనరీలు, బూట్లు మంజూరయ్యాయి. పాఠశాలలు తెరచిన మొదటిరోజే జగనన్న విద్యాకానుకను విద్యార్థులకు అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నేటి నుంచి 17 వరకు ఒంటిపూట బడులు

వేసవి ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతున్నందున ప్రభుత్వం నేటి నుంచి ఈనెల 17వరకు ఒంటిపూట బడులు నిర్వహించేలా ఉత్తర్వులు జారీచేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉదయం 7.30గంటల నుంచి 11.30గంటల వరకు పాఠశాలలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాగిజావ 8.30గంటల నుంచి 9.00గంటల్లోగా విద్యార్థులకు ఇవ్వాలి. మధ్యాహ్న భోజనం 11.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వండిపెట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.